క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశం కోసం మొదటి దఫా అడ్మిషన్‌లో భాగంగా అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద కోపా, డ్రాఫ్ట్‌మన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ విభాగాల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 10 వరకు చివరి అవకాశం ఉన్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరుద్యోగుల కోసం పోరాడుతా..

భూపాలపల్లి రూరల్: తనను గెలిపిస్తే ఉద్యోగుల సమస్యలతో పాటు నిరుద్యోగుల కోసం పోరాడతానని పట్టభద్రులు స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి అభ్యర్థి తాడిశెట్టి క్రాంతి కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వలాభం కోసం పార్టీలు మారుతూ ఆస్తులను కాపాడుకోవడానికి చీకటి దందాలను కొనసాగిస్తున్నా స్వార్థపూరిత రాజకీయ పార్టీల ఎమ్మెల్సీ అభ్యర్థులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సీరియల్ నంబర్ 33పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడి శెట్టి రఘు, నల్గొండ రాజు, కొగిల కిరణ్‌తేజ్, చంద్రగిరి శంకర్, నలిమెల సంజయ్, భుక్యా రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలో జీలుగ విత్తనాలు

వెంకటాపురం(కె): జీలుగ విత్తనాలు పీఏసీఎస్‌లో ఉన్నాయని సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలు తీసుకొని సొసైటీ కార్యాలయానికి రావాలని కోరారు. 30 కేజీల జీలుగు విత్తనాల ధర రూ.1,116కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'తీన్మార్ మల్లన్నను గెలిపించాలి'



వాజేడు: బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతం కష్ట పడుతున్న తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కాకర్ల పూడి విక్రాంత్, మండల అధ్యక్షుడు బొల్లె డెనార్జున్ రావు కోరారు. మండల కేంద్రంలో సోమవారం పట్ట భద్రులను కలిసి ఓటు వేయాలని వారు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలకు న్యాయం జరుగాలంటే ఇలాంటి వారు పెద్దల సభకు వెళ్లాలని వారిని పంపించే బాధ్యత పట్టభద్రులకు ఉందన్నారు. దాట్ల వీర వెంకట సీతారామ రాజు, సంజీవ, పూనెం రాంబాబు ఉన్నారు.

ప్రొక్లెయినర్ సీజ్



వెంకటాపురం(కె): మట్టిని అక్రమంగా తరలిస్తున్న ప్రొక్లెయినర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన సంఘటన మండల పరిధిలోని రాచపల్లి గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాచపల్లి గ్రామ సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ సమీపంలో మట్టి తవ్వుతు ప్రొక్లెయినర్ కనిపించడంతో సీజ్ చేసి రెవెన్యూ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్..



కాటారం: కాటారం మండలం ప్రతాపగిరి అటవీ ప్రాంతం నుంచి కాటారం వైపుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకొని సీజ్ చేసినట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అంజయ్య తెలిపారు. ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు వెంబడించి ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.బీట్ ఆఫీసర్ అశోక్, కాటారం బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

డ్రెయినేజీలు లేక ఇబ్బందులు

- రోడ్డుపైనే మురుగు నీరు
- పట్టించుకోని అధికారులు



డ్రెయినేజీలు లేక మొగుళ్లపల్లిలో రోడ్డు పక్కన నిలిచిన మురుగు నీరు

మొగుళ్లపల్లి: మండలంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. డ్రెయినేజీలు లేకపోడంతో మురుగు రోడ్డుపైనే పారుతోంది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపైనే మురుగు నీరు పారుతుందంటే ఇక గ్రామాల పరిస్థితి అధ్వానంగా తయారైంది. గ్రామాల్లో అంతర్గత రహదారులు అపరిశుభ్రంగా ఉన్నాయి. పారిశుద్ధ్య పనులు చేపించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలకు ప్రభుత్వం లక్షల రూపాయలు డ్రెయినేజీ వ్యవస్థ కోసం మంజూరు చేసినప్పటికీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా అనువైన చోట నిర్మించడం లేదనే ఆరోపణలున్నాయి. మండల కేంద్రంలోని రాల చెట్టు, చెరువుకట్ట, రక్తాని వాడ, ఎస్సీ కాలనీ తదితర కాలనీల్లో వర్షాకాలం వస్తే చాలు నీరంతా రోడ్డుపైనే నిలిచి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మురుగు నీరు వీధుల్లో ప్రవహించడం వల్ల దుర్వాసన వస్తోందని స్థానికులు తెలుపుతున్నారు. రోడ్లపై మురుగు నీరు ప్రవహించడం వల్ల వాటిపై ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తరచూ అనారోగ్యానికి గురువుతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు కలుగజేసుకొని మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో కూడా డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించుకోవాలని కోరుతున్నారు.

డ్రెయినేజీలు నిర్మించాలి



డ్రెయినేజీ వ్యవస్థ సరిగ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే గ్రామాల్లో డ్రెయినేజీలు నిర్మించాలి. పాలకుల నిర్లక్ష్యం కారణంగానే రోడ్ల పైకి మురుగు చేరుతుంది. అభివృద్ధి పేరిట లక్షలాది రూపాయలు కాజేస్తున్నారు. ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదు.

– సురేందర్, మొగుళ్లపల్లి

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న చల్ల నారాయణరెడ్డి, నాయకులు

కాటారం: తడిసిన ధాన్యాన్ని ఎలాంటి తరుగు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీజేపీ నాయకుడు చల్లా నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ధన్వాడ, దేవరాంపల్లి, శంకరాంపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. కొనుగోళ్లలో జాప్యం, రైతుల సమస్యలపై ఆరా తీశారు. అడిషనల్ కలెక్టర్, డీసీఓతో ఫోన్‌లో మాట్లాడి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పరిస్థితి, రైతుల సమస్యలను వివరించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టి రైతులకు ఇబ్బందులు కల్గకుండా చూడాలని అధికారులను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని సరైన సమయంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని ఆరోపించారు. ఇటీవల కురిసిన వర్షాలు రైతులను నిండాముంచాయని ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఉన్న మంత్రి శ్రీధర్‌బాబు సొంత మండలంలోనే రైతుల పరిస్థితి ఇలా ఉంటే ఇంకా రాష్ట్రం పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. నారాయణరెడ్డి వెంట మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి, మాజీ అధ్యక్షుడు బొమ్మన భాస్కర్‌రెడ్డి, దుర్గం తిరుపతి, స్వామియాదవ్, పాగె రంజిత్, గోగుల రాజేశ్, రాజు, కొండ రాము ఉన్నారు.

ప్రభుత్వమే ఖర్చులు భరించాలి

ఏటూరునాగారం: ఎన్నికల విధుల్లో అనారోగ్యం పాలైన బూర్గుపేట గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు మధుకుమార్‌ను ఆదుకోవాలని టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వాసుదేవరెడ్డి, వెంకటస్వామి ఐటీడీఏ పీఓను కోరారు. సోమవారం ఐటీడీఏలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పీఓ చిత్రామిశ్రాకు అందజేశారు. ఉపాధ్యాయుడు మధుకుమార్ ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల విధుల కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెళ్లగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని, అతడు నయం అయ్యే వరకు ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరించాలన్నారు. ఎం. వెంకటస్వామి, చెంచయ్య, రాజారత్నం పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా డంపింగ్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వాజేడు: నిబంధనలకు విరుద్ధంగా ప్రొక్లెయినర్‌తో తోడి టిప్పర్ల ద్వారా ఇసుకను డంపింగ్ చేస్తున్నారని డంపింగ్ చేస్తున్నారని వెంటనే పనులను నిలిపివేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రాహుల్ చంద్ర వర్మకు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్య దర్శి వర్గ సభ్యుడు గ్యానంవాసు మాట్లాడుతూ.. ప్రొక్లెయినర్లతో ఇసుకను తొలడంతో పేద గిరిజన గిరిజనేతరులకు ఉపాధి దక్కడం లేదన్నారు. భారీ వాహనాలు గోదావరి ఒడ్డు దిగవద్దని నిబంధనలు ఉన్నప్పటికీ రేజింగ్ కాంట్రాక్టర్ ఆ నిబంధనలను తుంగలో తొక్కి పనులను చేస్తున్నట్లు తెలిపారు. వినతి పత్రాన్ని ఇచ్చి ఇసుక తోలకాలను నిలిపి వేసేలా చర్యలను తీసుకోవాలని కోరారు. రఘుపతి రావు, గుగ్గిళ్ల దేవయ్య, కృష్ణ బాబు, ఆదినారాయణ, మహేష్ ఉన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ కల్యాణి

వెంకటాపురం(ఎం): అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వెంకటాపురం వ్యవసాయ అధికారిణి మేరుగు కల్యాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యాన్ని ఏఈఓ జీవన్‌రెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో విత్తనాలు కొనుగోలు చేసేటపుడు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద కొనుగోలు చేసి రసీదులు పొందాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే వ్యాపారస్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంటాలు సకాలంలో నిర్వహించాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న భూక్య జంపన్న

ములుగు రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలను సకాలంలో నిర్వహించి ధాన్యం మిల్లులకు తరలించాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు భూక్య జంపన్న అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం కల్లాలో తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యానికి సరిపడా టార్పాలిన్‌లో లేక ధాన్యం తడిసిందని అన్నారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తిరుకల్యాణానికి ముస్తాబైన ఆలయం



శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరిస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చలువ పందిర్లు వేసి ముస్తాబు చేశారు. నేడు అధ్యాయనోత్సవం, తొల్లకం ప్రారంభం, పుట్ట బంగారుసేవా, ధ్వజారోహణం, గరుడముద్ద, 22న మత్స్యగిరిస్వామి కల్యాణోత్సవం, మధ్యాహ్నం మహా అన్నదానం, 23న పూర్ణాహుతి, సాయంత్రం గజవాహనం సేవ (గుట్ట మీదకు పోవుట), 24న రథోత్సవం, అలుకతీరుట, సాంస్కృతిక కార్యక్రమాలు, 25న చక్రవర్తి, నాకబలి(నాగవల్లి), పండిత సన్మానంతో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

కీర్తిబాయి మృతి తీరనిలోటు



మాట్లాడుతున్న శ్రీనుబాబు

మహాముత్తారం: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కాంగ్రెస్‌పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు కీర్తిబాయి మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, శ్రీపాదట్రస్టు చైర్మన్ శ్రీనుబాబు అన్నారు. సోమవారం మండలంలోని బోర్లగూడెం గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. ముందుగా కీర్తిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పించి మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ ఒక మంచి మహిళనాయకురాలిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కీర్తిబాయి కుటుంబ సభ్యులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మహదేవాపూర్, కాటారం, మహాముత్తారం మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం



టేకుమట్ల: మండలంలోని రామకృష్ణాపూర్ (టి) గ్రామానికి చెందిన సమ్మిశెట్టి భాస్కర్ అనే రైతు పశుగ్రాసం సోమవారం దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. సమ్మిశెట్టి భాస్కర్ అనే రైతుకు చెందిన గడ్డివాము ప్రమాదవశాత్తు మంటలు అంటుకోగా స్పందించిన స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే మంటలు వ్యాపించడంతో సుమారు 3 ఎకరాల పశుగ్రాసం దగ్ధమైందని బాధిత రైతు తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కాటారం: మండలంలోని మేడిపల్లి అటవీ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. మల్హర్ మండలం పెద్ద తూండ్లకు చెందిన వెంకటేశ్ తన ద్విచక్రవాహనంపై భూపాలపల్లి నుంచి కాటారం వైపునకు వస్తున్నాడు. ముందు వెళ్తున్న లారీ, కారును ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వచ్చిన కారును ఢీకొన్నాడు. దీంతో వెంకటేశ్ ఎగిరిపడడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన వాహనదారులు భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

రేగొండ: మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయ డీలర్లు నియమ నిబంధనలు పాటించి, నిర్ణయించిన ధరలకు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి వాసుదేవ రెడ్డి అన్నారు. సోమవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు లాట్ నంబర్ రాసి రైతు సంతకంతో బిల్లు ఇవ్వాలన్నారు. ధరల పట్టిక, స్టాక్ నిలువ పట్టికలు రోజు వారీగా నమోదు చేయాలన్నారు. ఎరువుల బస్తాలు తూకం కచ్చితంగా ఉండేలా చూసుకోవాలని, ఎమ్మార్పీకే విక్రయించాలని తెలిపారు. డీలర్లు నిబంధనల ప్రకారం అమ్మకాలు జరపాలని, లేని పక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీలర్ల అధ్యక్షుడు మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



తనిఖీ చేస్తున్న నర్సింహారావు

వెంకటాపురం(కె): రైతులకు విత్తన డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి గుంటక నర్సింహారావు అన్నారు. సోమవారం మండలంలోని ఎరువుల, విత్తనాల షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లోని స్టాక్ రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు విక్రయించిన విత్తనాలకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని డీలర్లకు సూచించారు. ఎవరైనా ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. లేబింగ్, తయారుదారుని వివరాలు సరిగా చూసుకోని రైతులు కోనుగోలు చేయాలని అన్నారు.

విత్తనాలకు రసీదు తీసుకోవాలి

ఏటూరునాగారం: మండలంలోని రైతులు వరి, మిర్చి, పత్తి, ఇతర విత్తనాలకు తప్పకుండా డీలర్ల నుంచి రసీదు తీసుకోవాలని ఏఓ వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే వర్షాకాలం సీజన్‌లో వరి, మిర్చి ఇతర ఏ విత్తనాలు అయినా లైసెన్సులు కలిగిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని సూచించారు. విత్తన డీలర్లు మిర్చి విత్తనాలని బ్లాక్ మార్కెట్ చేసి అధిక ధరలకు విక్రయాలు జరిపితే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. విత్తన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

సరైన సమయంలో టీకాలు వేయాలి



సందీప్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

మల్హర్: ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని డీడీఓ (ఇన్‌చార్జ్ వైద్యాధికారి) సందీప్ అన్నారు. మండలంలోని తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్స్, సిబ్బందితో సోమవారం రివ్యూ, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు టీకాలు సరైన సమయంలో వేయాలని సూచించారు. వర్షాలు, ఎండలతో ప్రజలు వ్యాధుల భారీన పడకుండా చర్యలు చేపట్టాలని వివరించారు. ప్రతి సబ్ సెంటర్ పరిధిలో గర్భిణుల వివరాలు ఆన్‌లైన్ నమోదు చేయాలని పేర్కొన్నారు. అనంతరం సందీప్‌ను సిబ్బంది శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సిగ్నల్ లేక గ్రామస్తుల అవస్థలు



టవర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

చిట్యాల: తమకు సిగ్నల్ లేక మూడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని పలువురు మండలంలోని అందుకుతండా గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఎంపీ పసునూరి దయాకర్ తమకు సెల్ ఫోన్ సిగ్నల్ లేక అనేక అవస్థలు పడుతున్నామని విన్నవించుకోగా స్పందించి బీఎస్‌ఎన్‌ఎల్ టవర్‌ను మంజూరు చేశారన్నారు. కాని నూతనంగా నిర్మించిన టవర్‌కు సిగ్నల్ ఏర్పాటు చేయక పోవడంతో మూడు గ్రామాలకు (అందుకుతండా, చైన్‌పాక, వెంచరామి) ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. టవర్ నిర్మాణం జరిగి ఆరు నెలలు అయినప్పటికీ సిగ్నల్ పాయింట్ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే సిగ్నల్ పాయింట్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్దంకి భాస్కర్, వెంచరామి మాజీ సర్పంచ్ కచ్చ మల్లేష్, గ్రామస్తులు భుక్యా రాజు నాయక్, స్వామి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



కొత్తపల్లిగోరిలో నగదు అందజేస్తున్న మిత్రులు



రేగొండలో..

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండల కేంద్రానికి చెందిన కట్ల సృజన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో మృతురాలితో కలిసి 2007 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి మిత్రులు బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించి రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నిమ్మల శంకర్, పల్లెబోయిన నవీన్, నెల్లి ప్రశాంత్, బోడకుంట్ల కృష్ణ, కర్నె చిరంజీవి, నంది విజయ్, నాగరాజు, నర్సింగం, ప్రభాకర్, కట్ల రమేష్, సుదర్శన్, సతీష్, రమేష్, చంద్రమౌళి, కల్యాణి, హరిత, మాధవి, సరిత, కల్యాణితో పాటు తదితరులు పాల్గొన్నారు.

రేగొండలో..

మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన కొండమల్ల సుభద్ర ఐలయ్య దంపతుల కుమారుడు జయంత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో 1996–97 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి మిత్రులు సుభద్ర కుటుంబాన్ని పరామర్శించి, రూ.81 వేలు ఆర్థిక సాయం అందజేశారు. శ్రీనివాస్, శ్రీధర్, సమ్మయ్య, వేణు, వెంకట్, సువిధ, సతీష్, రాజు, ఐలయ్య పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ములుగు రూరల్: వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అకాల వర్షం కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నిల్వాలు లేకుండా సకాలంలో కాంటాలు నిర్వహించి మిల్లులకు తరలించాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి క్వింటాకు రూ.5 వందలు బోనస్ చెల్లించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రతు భరోసా, రుణమాఫీని వెంటనే చేయాలని అన్నారు.